క్లుప్తంగా

పిచ్చిమొక్కల తొలగింపు

ఖానాపురం : మండలంలోని పాకాల ఆయకట్టు పరిధిలోని మాటువీరారం కాల్వలో పిచ్చి మొక్కలతో పాటు చెట్టు విరిగి పడిపోయింది. దీంతో కాల్వలో అడ్డుగా ఉండటంతో నీరు చివరి ఆయకట్టుకు వెళ్లకుండా ఆగిపోయి రైతులకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. దీంతో ఎంపీపీ ప్రకాశ్‌రావు, బీఆర్‌ఎస్ గ్రామపార్టీ అధ్యక్షుడు బందారపు శ్రీనివాస్‌గౌడ్‌ల ఆధ్వర్యంలో పిచ్చిమొక్కలు తొలగింపు చేపట్టారు .

అభివృద్ధి పనులపై తీర్మానం

చెన్నారావుపేట : చెన్నారావుపేట ప్రధాన రహదారిపై 80ఫీట్లకు, కోనాపురం రోడ్డు 40ఫీట్లకు రోడ్డు వెడల్పు పనులకు గ్రామసభలో తీర్మానించామని సర్పంచ్ కుండె మల్లయ్య తెలిపారు. ఈ మేరకు గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం గ్రామసభ నిర్వహించారు. సభలో వైస్ ఎంపీపీ, వార్డు సభ్యులు, నాయకలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

వరంగల్ (పర్వతగిరి) : విద్యార్థులు క్రీడల్లో రాణించాలని సర్పంచ్ గటిక సుష్మ అన్నారు. ఈ మేరకు మండలంలోని చింతనెక్కొండ పాఠశాలలో స్కూల్ డెవలప్‌మెంట్ ఫండ్ మంజూరు కావడంతో వాటితో కొనుగోలు చేసిన ఆట వస్తువులను శనివారం విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రమేష్‌బాబు, ఎస్‌ఎంసీ చైర్మన్ మహేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉగాది క్యాలెండర్ ఆవిష్కరణ



చెన్నారావుపేట : త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవాసమితి హిందూ జ్ఞాన వేదిక వరంగల్ కమిటీ అధ్యక్షుడు ఓం ప్రకాష్ ఆధ్వర్యంలో ఉగాది క్యాలెండర్‌ను తహసీల్దార్ బన్సిలాల్ శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆచార్య ప్రబోధనంద యోగీశ్వరుల స్వామివారు రచించారని అన్నారు. తెలుగు నెలలు అనుసరించుటకు వీలుగా తెలుగు తిథులతో ఆంగ్ల తేదీలను పొందుపరచి తయారు చేయబడిందన్నారు. ప్రజలందరికి ఈ క్యాలెండర్ ఉపయోగపడుతుందని సూచించారు. నర్సింహరావు, విక్రమచారి, సుధాకర్, కిరణ్, చారి, కట్టయ్య, వీరాచారి, పద్మ, నిర్మల, శశిరేఖ ఉన్నారు.

గంగమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ



వరంగల్ (పర్వతగిరి) : మండలంలోని ఏనుగల్‌లో శనివారం గంగమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ హాజరు కాగా అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వచనాలు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సింగ్‌లాల్, సర్పంచ్ ధంసెట్టి సంధ్యనర్సింగం, నాయకులు భాస్కరరావు, ఎంపీటీసీ కోల మల్లయ్య, గంధం బాలరాజు, నరేందర్‌వర్మ, తదితరులు పాల్గొన్నారు.

రేపు తైబజార్ వేలం

వరంగల్(పర్వతగిరి) : మండలంలోని అన్నారం షరీఫ్ గ్రామ పంచాయతీ పరిధిలో సంత తైబజార్ 2023–24సంవత్సరానికి గాను ఈనెల 20వ తేదీన ఉదయం 11గంటలకు వేలం నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి ఎండి.మొయినోద్దీన్, సర్పంచ్ మునుకుంట్ల యశోద శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ.. వేలంలో పాల్గొనే వారు ముందుగా రూ.1లక్ష నగదు చెల్లించి రశీదు పొందాలన్నారు.

వ్యక్తిపై కేసు

చెన్నారావుపేట : నర్సంపేట మండలం గుర్రాలగండీ రాజపల్లికి చెందిన జయపాల్ తన ద్విచక్ర వాహనంపై నెక్కొండకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో అమీన్‌పేట సమీపంలో రోడ్డు దాటుతున్న బాలసేనా అనే చిన్నారిని ద్విచక్ర వాహనంతో ఢీ కొట్టాడు. దీంతో బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి. బాలుడి తండ్రి బాలస్వామి ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తోట మహేందర్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

నర్సంపేట రూరల్ : రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతిచెందిన సంఘటన నర్సంపేట మండలంలోని ఆకులతండా సమీపంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నల్లబెల్లి మండలంలోని మేడపల్లి గ్రామానికి చెందిన తాళ్లపల్లి మల్లయ్య(46) తన పని నిమిత్తం నర్సంపేటకు వచ్చి తిరిగి రాత్రి ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. ఈక్రమంలో నర్సంపేట మండలంలోని ఆకులతండా గ్రామానికి చేరుకునే సరికి ఎద్దు ఒక్కసారిగా రోడ్డుపైకి రావడంతో ద్విచక్రవాహనం కిందపడిపోవడంతో తీవ్రగాయాలు కాగా స్థానికులు గమనించి 108లో నర్సంపేటకు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకొచ్చారు. చికిత్స పొందుతుండగా మల్లయ్య మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

అభివృద్ధికి ఆకర్షితులై చేరికలు

● ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి



బీఆర్‌ఎస్‌లో చేరిన వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట : బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై ఎంతో మంది పార్టీలో చేరుతున్నారని ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం నెక్కొండ మండలం బొల్లికొండ గ్రామపార్టీ అధ్యక్షుడు రాంచంద్రు, ఉపాధ్యక్షుడు రాంకోటి, మాజీ సర్పంచ్ మాలోత్ యాకు, మాజీ ఎంపీటీసీ సుగ్రీవ్, డైరెక్టర్ జి.రమేష్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బానోత్ వెంకన్న, కాసోజు యాకంబరాచారి, బీఓ అధ్యక్షురాలు శ్రీలత, మహిళలతో పాటు మరో 30కుటుంబాలు కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి బీఆర్‌ఎస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బొల్లికొండ గ్రామ అభివృద్ధికి కట్టుబడి ఉంటామన్నారు. కార్యక్రమంలో జెడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న, నెక్కొండ మండల అధ్యక్షుడు, ఎంపీపీ, జెడ్పీటీసీ, క్లస్టర్ బాధ్యులు, ఎంపీటీసీలు, పార్టీ ముఖ్య నాయకులు, పీఏసీఎస్ చైర్మన్, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు వరం సీఎంఆర్‌ఎఫ్

అనారోగ్యంతో బాధపడుతూ వైద్యం చేయించుకునే ఆర్థిక స్తోమత లేని ఎంతో మంది పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ వరంలా మారిందని నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నల్లబెల్లి మండలం బుచ్చిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన వాంకుడోత్ స్వాతి గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతుండగా శనివారం రూ.1.50లక్షల విలువ చేసే సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్, వార్డు మెంబర్, పార్టీ ముఖ్య నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ దేవుడి ఆశీస్సులు ఉండాలి

చెన్నారావుపేట : ప్రపంచ దేవుడి ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలపై ఉండాలని ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు చెన్నారావుపేట మండలంలోని జోజిపేట నారాయణ తండాలోని పునీత రాయప్ప చర్చి మహోత్సవ(ఊరుపండుగ) వేడుకలు శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఆయన పాల్గొని 25సంవత్సరాలు పూర్తి చేసుకున్న గురువులు ఫాదర్ రెవ నరిసెట్టి గోవాశౌరి, కార్లపాటి జోజి, తమ్మ యాగారెడ్డిలను ఎమ్మెల్యే సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని అన్నారు. ఊరు పండుగ వేడుకల్లో పాల్గొనడం సంతోషంగా ఉందని, తన కోసం ప్రార్థన చేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ అంద్ర విజయ బాలజోజి, కుండె మల్లయ్య, జెడ్పీటీసీ బానోత్ పత్తినాయక్, వైస్ ఎంపీపీ కంది కృష్ణారెడ్డి, సొసైటీ చైర్మన్ ముద్దసాని సత్యనారాయణరెడ్డి, ఆర్‌బీఎస్ మండల కన్వీనర్ బుర్రి తిరుపతి, జున్నూతుల రాంరెడ్డి, జక్క అశోక్, జ్యోతి, ఆరోగ్యం, శాంతయ్య, శౌరీలు, తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు 'ఆయుష్' కిట్లు



నెక్కొండ: ఆయుష్ కిట్లు అందిస్తున్న జయప్రకాశ్



సంగెంలో..

నెక్కొండ : విద్యార్థుల్లో రోగ నిరోధక శక్తిని పెంచేందుకు ఆయుష్ కిట్లు ఎంతగానో దోహద పడుతాయని దుగ్గొండి మండల ఆయుర్వేదిక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జయప్రకాశ్ అన్నారు. నెక్కొండలోని తెలంగాణ రాష్ట్ర గురుకుల పాఠశాల/కళాశాల(బాలికలు)లో శనివారం కేంద్ర ప్రభుత్వం ఆరోగ్య మంత్రిత్వశాఖ ఆయుష్ విభాగం అందిస్తున్న ఆయుష్ కిట్లపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం చలామణిలో ఉన్న మందులతో ఎంతో కొంత దుష్ప్రభావం కారణంగా విద్యార్థి దశలోనే రోగ నిరోధక శక్తి తగ్గతోందని వైద్య నిపుణులు చెబుతున్నారని అన్నారు. వివిధ అంశాలను పరిగణలోకి తీసుకున్న ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నత పాఠశాలను ఎంపిక చేసిందని ఆయన పేర్కొన్నారు. ఆయుర్వేదం, యోగ, యునాని, సిద్ధ, హోమియోపతి వైద్య విభాగాలు ఆయుష్ పేరిట పని చేస్తున్నాయన్నారు. విద్యార్థులు ఎదిగే సమయంలో ప్రధానంగా 9, 10 తరగతులు చదివే వయస్సు ఎంతో కీలకమని ఆయన చెప్పారు. అనంతరం విద్యార్థులకు ఆయుష్ పరంగా ఆరోగ్య కిట్లను ఆయన పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ చింత రవీందర్, ఆయుష్ వైద్యుడు డాక్టర్ ప్రభాకర్, ఏటీపీ మమత, ఫార్మసిస్టులు కె.రమేష్‌బాబు, భాస్కర్, అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయ వైద్య విధానం మేలు

సంగెం : సంప్రదాయ వైద్య విధానంతో ఎంతో మేలు కలుగుతుందని ఆయుర్వేద వైద్యుడు కె.రాజేందర్ అన్నారు. శనివారం మండలంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో బాలికలకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం బాలికల ఆరోగ్యం కోసం ఆయూష్ కిట్లు, రాగి లడ్డులు అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఓ నీలిమ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'చావే దిక్కు.. ఇక పనులు చేయం'



ప్రభుత్వం తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న అధికార పార్టీ సర్పంచ్‌లు

● అధికారులు పనులపై ఒత్తిడి చేయొద్దు
● అప్పుల పాలుచేస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం
● అధికార పార్టీ సర్పంచ్‌ల ఆగ్రహం

ఖానాపురం : 'పదకొండు నెలలుగా బిల్లులు రావడం లేదు.. పంచాయతీ కార్మికులకు జీతాలు ఇవ్వడం లేదు.. రాష్ట్ర ఫైనాన్స్ నిధులు అందలేదు.. ఇక మాకు చావే దిక్కం'టూ అధికార బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు ప్రారంభం కావాల్సిన మండల సర్వసభ్య సమావేశం 11.50 గంటలకు ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు అధ్యక్షతన ప్రారంభమైంది. వ్యవసాయ శాఖపై ఏఓ శ్రీనివాస్, పశు సంవర్ధక శాఖపై వీఏ మానస, ఐసీడీఎస్‌పై సూపర్‌వైజర్ రమాదేవి సభ్యుల సమస్యలపై సమాధానం ఇచ్చారు. వైద్యశాఖపై జరిగిన సమీక్షలో హెల్త్ అసిస్టెంట్ భద్రు, ఆశ కార్యకర్త నీలను ఉద్యోగం నుంచి తొలగించాలని సర్పంచ్ బాలకిషన్ డిమాండ్ చేశారు. దీనిపై తీర్మానం చేయాలని సభ్యుల సమక్షంలో కోరారు. విద్యుత్‌శాఖపై సమస్యల పరిష్కారంలో చొరవ చూపాలని సభ్యులు కోరారు. త్రీఫేస్ విద్యుత్ రెండు రోజులు పూర్తిగా నిలిపివేయాలని ఎంపీపీ ప్రకాశ్‌రావు సూచించారు. పంచాయతీరాజ్ శాఖపై సమీక్ష చేసే క్రమంలో అధికారులు రాకపోవడంతో సర్పంచ్‌లు ప్రవీణ్‌కుమార్, బాలకిషన్, వెంకన్న, సుమన్, కవిత, అశోక్‌లు అసహనం వ్యక్తం చేశారు. నిధులు ఉన్నా చెక్కులు జనరేట్ కావడంలేదని, ప్రభుత్వం ఫ్రీజ్ చేయడంపై పలువురు సర్పంచ్‌లు ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు నెలల పాటు గ్రామాల్లో పనులు కూడా నిలిపివేస్తామన్నారు. సర్పంచ్‌లను ప్రభుత్వం అప్పుల పాలు చేస్తోందని, బిల్లులు ఇలానే నిలిపివేస్తే రానున్న రోజుల్లో ప్రభుత్వానికే నష్టం జరుగుతుందని హెచ్చరించారు. తాగునీటి శాఖపై జరిగిన సమీక్షలో భగీరథ పనుల బిల్లులు రాలేదని, బిల్లులు ఇవ్వమంటే ఎంబీలు చింపివేస్తామని సర్పంచ్‌లు ఆగ్రహించారు. ఈజీఎస్‌పై జరిగిన సమీక్షపై సర్పంచ్‌లు ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతర ం ఏఓ, జూనియర్ లైన్‌మన్‌లను పనితీరుపై సన్మానించారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ సుమణవాణి, ఎంపీఓ పసరగొండ రవి, డీటీ సృజన్‌కుమార్, ఎంపీటీసీలు, సర్పంచ్, అధికారులు పాల్గొన్నారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

రాయపర్తి : తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఐదో తరగతిలో ప్రవేశాల గడువు తేదీని పొడిగించినట్లు ప్రిన్సిపాల్ ఉమామహేశ్వర్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఈనెల 20 వరకు గడువును పొడిగించినట్లు తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

లీకేజీ బాధ్యత 'ప్రభుత్వానిదే'

చెన్నారావుపేట : ఏఈ ఉద్యోగ నియామక పేపర్ లీకేజీలో పూర్తి బాధ్యత ప్రభుత్వానిదేనని కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు నన్నెబోయిన రమేష్‌యాదవ్ అన్నారు. ఈ మేరకు శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు నిరుద్యోగులను, విద్యార్థులను యువకులను మోసం చేయడం దారుణమని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ఉద్యమం చేసిన యువకులను ఉద్యోగుల పేరుతో ఆటలు ఆడుకోవడం ఈ ప్రభుత్వానికే చెల్లుతుందన్నారు. గ్రూప్–1 పరీక్ష పేపర్ లీక్ చేయడంతో ప్రభుత్వం సిగ్గుపడాలన్నారు. తెలంగాణలో నిరుద్యోగ విద్యార్థులకు ఉద్యోగాలు వచ్చే పరిస్థితి లేదన్నారు.

విగ్రహాల కొనుగోలుకు విరాళాలు



విరాళం అందజేస్తున్న మాన్సింగ్ దంపతులు

ఖానాపురం : మండలంలోని ధర్మరావుపేటలో నూతనంగా నిర్మిస్తున్న రామాలయం, శివాలయాలకు దాతలు విరాళాలు అందజేస్తున్నారు. ఇందులో భాగంగా విగ్రహాల కొనుగోలుకు గ్రామానికి చెందిన భూక్యా గోమిలిమాన్సింగ్ దంపతులు రూ.4, 21, 116లను విరాళంగా ఆలయ నిర్మాణ కమిటీ బాధ్యులకు శనివారం అందజేశారు. అలాగే ఆంజనేయస్వామి దేవాలయం నిర్మాణం కోసం శంకుస్థాపన పూజా కార్యక్రమాలను చేపట్టారు. శంకరయ్య, వెంకటేశ్వర్‌రావు, నిర్మల, సరస్వతిలు రూ. 30వేల విరాళం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెన్ను శృతిపూర్ణచందర్, ఆలయ నిర్మాణ కమిటీ చైర్మన్ రాజేశ్వర్‌రావు, పూజారి అన్వేష్‌శాస్త్రీ పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎమ్మార్పీఎస్ పాదయాత్ర



అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

వరంగల్(పర్వతగిరి) : కేంద్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణపై చేస్తున్న నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా మంద కృష్ణ మాదిగ పిలుపు మేరకు ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన మాదిగల సంగ్రామ పాదయాత్ర శనివారం తొమ్మిదో రోజుకు మండలంలోని వడ్లకొండ గ్రామానికి చేరుకుంది. ఈ మేరకు పాదయాత్ర బృందం సభ్యులు కట్ల రాజశేఖర్, ఇనుముల పూర్ణయ్య, జన్ను, పర్లపల్లి దీపక్‌లకు అంబేద్కర్ యువజన నాయకులు వల్లందాసు రంగన్న, వల్లందాసు దయాకర్‌లు స్వాగతం పలికారు. అనంతరం గ్రామంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజుయాదవ్, రంగయ్య, వల్లపుదాసు రమేష్, కుమార్ పాల్గొన్నారు.

వ్యవసాయ క్షేత్రంలో మంత్రి ఎర్రబెల్లి



పొలం గట్లపై నడుస్తున్న మంత్రి ఎర్రబెల్లి

వరంగల్ (పర్వతగిరి) : ఆపన్నులను ఆదుకోవడం.. ఇతరులకు సాయం చేయడంలోనే కాదు.. వ్యవసాయ సాగులోనూ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తనకు తానే సాటి. నిత్యం ప్రజాసేవ, అధికారిక కార్యక్రమాలు, రాజకీయ సమీక్షలు.. ఇలా ఎప్పుడూ బీజీగా గడిపే రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మంచినీటి సరఫరా శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఖాళీ సమయం దొరికితే చాలు తన వ్యవసాయ క్షేత్రానికి వెళ్తుంటారు. ఈ సందర్భంగా శనివారం సాయంత్రం మంత్రి ఎర్రబెల్లి తన వ్యవసాయ క్షేత్రానికి వెళ్లారు. పొలం గట్లపై నడుస్తూ మొత్తం కలియతిరిగారు. పంటలను పరిశీలించి అక్కడ పనిచేస్తున్న వారికి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. మంత్రి ఎర్రబెల్లి పొలం గట్లపై నడుస్తూ అందరిని ఆశ్చర్యపరిచారు.

నేడు మండలానికి మంత్రి రాక

రాయపర్తి : మండలంలో నేడు(ఆదివారం) రాష్ట్ర పంచాయతీరాజ్,గ్రామీణాభివృద్ధిశాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పర్యటించనున్నారు. ఉదయం 9గంటలకు పెర్కవేడులో కుట్టు మిషన్ శిక్షణలో భాగంగా శిక్షణ పొందిన స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులకు కుట్టు మిషన్లను పంపిణీ చేయనున్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



చెన్నారావుపేట: నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి



నల్లబెల్లి: వినయ్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న నానబోయిన రాజారాం తదితరులు

చెన్నారావుపేట : మండలంలోని ఉప్పరపల్లి గ్రామానికి చెందిన కాసాని లక్ష్మి, రెడ్డబోయిన ఐలయ్య మృతిచెందారు. కాగా మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి శనివారం వారి మృతదేహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మండల అధ్యక్షుడు భూక్యా గోపాల్‌నాయక్, జిల్లా కార్యదర్శి మొగిళి వెంకట్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు రమేష్, విజేందర్, సర్పంచ్‌లు రమేష్, తిరుపతిరెడ్డి, ఆవుల రాములు, బానోత్ వీరన్న, తదితరులు ఉన్నారు.

మంత్రి ఎర్రబెల్లి పరామర్శ

వరంగల్ (పర్వతగిరి) : రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు కారు డ్రైవర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. ఈ మేరకు మండలంలోని వడ్లకొండలో బైరి రంజిత్ ఇంటికి శనివారం వెళ్లి పరామర్శించారు. కార్యక్రమంలో రాజుయాదవ్, రంగయ్య, నాయకులు తదితరులు ఉన్నారు.

గ్రంథాలయ చైర్మన్ వినయ్‌కి ఘన నివాళి

నల్లబెల్లి : జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బొచ్చు వినయ్ అకాల మృతి చెందడంతో స్థానిక గ్రంథాలయంలో శనివారం సంతాప సభ ఏర్పాటు చేశారు. వినయ్ చిత్రపటానికి సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు నానబోయిన రాజారాం పూలమాల వేసి నివాళులర్పించారు. ఆత్మశాంతికి రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా రాజారాం మాట్లాడుతూ.. అకాల మృతి చెందిన వినయ్ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ ఇన్‌చార్జ్ అధికారి రాపాల లక్ష్మీనారాయణ, పరికి కొర్నేల్, మధు, రవి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధికి సహకరించాలి



రాయపర్తి: మాట్లాడుతున్న హెచ్‌ఎం ఉమాదేవి



వర్ధన్నపేట: మాట్లాడుతున్న రమేష్‌బాబు



దుగ్గొండి: మండపల్లి పాఠశాలలో..



చెన్నారావుపేట: విద్యార్థుల తల్లిదండ్రులతో హెచ్‌ఎం ఫ్లోరెన్స్, ఉపాధ్యాయ బృందం

చెన్నారావుపేట : పాఠశాల అభివృద్ధికి ప్రతీ ఒక్కరు సహకరించాలని అకాడమిక్ మానిటరింగ్ అధికారి మాలోత్ సారయ్య అన్నారు. ఈ మేరకు మండలంలోని ఉప్పరపల్లి గ్రామంలోని హైస్కూల్‌లో శనివారం విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు, మధ్యాహ్నం భోజన అమలు, విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేయడం, మన ఊరు-మన బడి పనుల పురోగతి వంటి అంశాలపై చర్చించారు. అంనతరం ఆయన సమావేశాన్ని ఉద్దేశించి టెలి కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. విద్యార్థులు రెగ్యూలర్‌గా పాఠశాలకు హాజరయ్యే విధంగా చూడాలన్నారు. పాఠశాల అభివృద్ధి పట్ల తల్లిదండ్రులు శ్రద్ధ చూపాలన్నారు. ప్రతి నెల మూడో శనివారం నిర్వహించే తల్లిదండ్రుల సమావేశంలో అందరూ హాజరు కావాలన్నారు. హెచ్‌ఎం ఫ్లోరెన్స్ మాట్లాడుతూ.. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల వసతులు కల్పిస్తున్నామని అన్నారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

దుగ్గొండిలో..

దుగ్గొండి : ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తల్లిదండ్రులు, గ్రామస్తులు సహకారం అందించాలని దుగ్గొండి, మండపల్లి పాఠశాలల హెచ్‌ఎంలు ప్రవీణ్‌కుమార్, రామ్మూర్తి అన్నారు. స్థానిక పాఠశాలల ఆవరణలో శనివారం పేరెంట్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పాఠశాలలలో ప్రభుత్వం మనఊరు-మన బడి కార్యక్రమాలలో భాగంగా అన్నీ రకాల సౌకర్యాలు కల్పించడం జరుగుతుందన్నారు. విద్యార్థులందరికి తమ ఊరి బడికే పంపాలని సూచించారు. అనంతరం మండపల్లి పాఠశాలలో చదువులో ప్రతిభ కనబర్చిన రేవూరి పూజితను ఆమె తల్లిదండ్రులు జగన్ మోహన్‌రెడ్డి-సుమలత దంపతులను ఉపాధ్యాయులు శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

పర్వతగిరిలో..

వరంగల్ (పర్వతగిరి) : పాఠశాల అభివృద్ధికి ప్రతీ ఒక్కరు తోడ్పాటును అందించాలని సర్పంచ్ చింతపట్ల మాలతి అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలోని జెడ్పీఎస్ఎస్, ప్రాథమిక పాఠశాలలో శనివారం హెచ్‌ఎం చంద్రమౌళి అధ్యక్షతన పేరెంట్స్, ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల అభివృద్ధిపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మాడుగుల రాజు, బొట్ల మహేంద్ర, ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ సభ్యులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పిల్లలు చదువుకునేలా తల్లిదండ్రులు చూడాలి

వర్ధన్నపేట : తల్లిదండ్రులు తమ పిల్లలు బడికి వెళ్లడంతో పాటు వారు బాగా చదువుకునే విధంగా చూడాలని వర్ధన్నపేట ప్రాథమిక పాఠశాల చైర్మన్ బాలె రమేష్‌బాబు అన్నారు. శనివారం పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలకు వ్యవసాయపు పనులు, లేదా ఇతరత్రా పనులు చెప్పకుండా వారు బడికి వెళ్లి చదువుకేనేలా చూడాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పిల్లల భవిష్యత్‌పై దృష్టి సారించాలి

రాయపర్తి : తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్‌పై దృష్టి సారించి చదువులో రాణించేలా ప్రత్యేక చొరవ తీసుకోవాలని ప్రధానోపాధ్యాయురాలు ఆజ్మీరా ఉమాదేవి పేర్కొన్నారు. శనివారం మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక చొరవ తీసుకొని పాఠశాలకు పంపించి వందశాతం హాజరయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రావుల భాస్కర్‌రావు, గుగులోత్ సునీత, ప్రవీణ్‌రెడ్డి, వీవీశర్మ, మారం రోజారాణి, మమత, రోహిణిదేవి, సీఆర్పీ స్వర్ణ, ఉమ తదితరులు పాల్గొన్నారు.

పిచ్చికుక్క దాడిలో పలువురికి గాయాలు

రాయపర్తి : మండలంలోని కొండూరు గ్రామానికి చెందిన తాళ్లపెల్లి శ్రీనివాసరావు తన ఇంట్లో నుంచి బయటికి రావడంతో అదే సమయంలో అక్కడికి వచ్చిన పిచ్చికుక్క అతడిపై ఒక్కసారిగా దాడి చేసింది. ఆ సమయంలోనే బయటకు వచ్చిన శ్రీనివాసరావు భార్య ఉమ, కూతురు శ్రీదేవిపై సైతం దాడి చేసింది. శ్రీనివాసరావు వరంగల్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వీధి కుక్కల నివారణకు ప్రజాప్రతినిధులు కృషి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నిలిచి ఉన్న లారీని ఢీకొట్టిన మరో లారీ

నిలిచి ఉన్న లారీని వెనక నుంచి మరో లారీ ఢీకొట్టిన సంఘటన మండలకేంద్రం శివారులోని మార్కెట్ యార్డు సమీపంలో శనివారం చోటు చేసుకుంది. గ్రామస్తుల తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. వరంగల్ వైపు నుంచి తొర్రూరుకు ఓ లారీ వెళ్తుండగా వెనుక నుంచి మరో లారీ వచ్చి ఢీకొట్టింది. దీంతో డ్రైవర్‌కు స్వల్పగాయాలైనట్లు తెలిపారు.